సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ఇండోర్ స్టేడియంకు మహర్దశ

కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు రంగం సిద్ధమైంది. మల్టీపర్పస్ కోర్టులను ఆధునీకరించేందుకు శ్రీకారం చుట్టారు. -8లో



సమస్యలను పరిష్కరిస్తాం

ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం
30.6/23.9

వాతావరణం

జిల్లాలో గురువారం 23.9 - 30.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కురుస్తున్న వాన



వర్షంరాకతో తడిగా మారిన రాజీవ్‌మార్గ్

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి వాన కురుస్తోంది. గురువారం కూడా పలు మండలాల్లో వర్షం కురిసింది. పోరుమామిళ్ల మండలంలో అత్యధికంగా 5.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. కాశినాయన మండలంలో 4.6, చక్రాయపేటలో 4 , రాజుపాలెంలో 2.8, చాపాడులో 1.4, జమ్మలమడుగులో 1.2 , బి కోడూరు, గోపవరం మండలాల్లో 1, అట్లూరు మండలంలో 0.8, బద్వేల్ మండలంలో 0.6 ఎంఎం వర్షం కురిసింది. కాగా, కడపలో కూడా గురువారం మధ్యాహ్నం ఉన్నట్లుంటి ఆకాశమంతా మేఘావృతమై వర్షం కురిసింది.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న పాలక మండలి సభ్యుడు కట్టా సత్తెయ్య

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటకు గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపాల్‌రెడ్డి, వీరమ్మల పేరిట నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, ఆలయ అధికారులు అందజేశారు.


ప్రమాణ స్వీకారం



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కుప్పం ప్రసాదరావు

చక్రాయపేట: ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గురువారం కుప్పం ప్రసాదరావు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని గొల్లపూడిలో దేవదాయశాఖ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్యాలయంలో చైర్మన్ కామేశ్వర రావు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ శ్రీనివాస్, జీఎం నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ



ఎం.వి.సుబ్బారెడ్డి భాస్కర్ చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీ రైతు సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య తెలిపారు. కడపలోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో గురువారం ఆ సంఘం జిల్లా సమితి సమావేశం సందర్భంగా ఈ ఎంపిక జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.వి.సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతిరెడ్డి భాస్కర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా టక్కోలి మనోహర్ రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా చంద్ర, ఉపాధ్యక్షులుగా ఎస్.శంకర్ రెడ్డి, కట్టా యానాదయ్యలతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

26న బ్యాడ్మింటన్ ఎంపికలు

రాజంపేట టౌన్: ఈనెల 26వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆకేపాటి శంకర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రావు, జిల్లా సెలక్షన్ కమిటీ కన్వీనర్ వై.నందకిషోర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరిగే పురుషుల, మహిళల సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. సెలక్షన్ కోసం వచ్చే క్రీడాకారులు వైట్ అండ్ వైట్ దుస్తులు వేసుకొని రావాలన్నారు. అలాగే ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో సెలక్షన్ రోజున ఉదయం 9 గంటల నుంచి పది గంటల లోపు క్రీడా మైదానానికి చేరుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9398865739 నంబరులో సంప్రదించాలని కోరారు.

సామాజిక ప్రభంజనం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మురిసిన కడప నగరం
- నాయకులకు అడుగడుగునా అపూర్వ స్వాగతం
- అలరించిన లంబాడీ నృత్యాలు, డప్పు వాయిద్యాలు



కడపలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రభం'జనం' సృష్టించింది. గురువారం ఉదయం నుంచే కడపలో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది. జనం నీరాజనాలు పలికారు. బస్సు యాత్ర సాగే రోడ్డులో రవీంద్రనగర్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కనువిందు చేశాయి. రోడ్ల వెంట కట్టిన వైఎస్సార్ సీపీ మూడు రంగుల జెండాలు రెపరెపలాడాయి. మధ్యాహ్నం 3.25 గంటలకు యూఎస్ మహల్ నుంచి బస్సు యాత్ర ర్యాలీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ర్యాలీ వెంట లంబాడీలు తమ నృత్యాలతో, డప్పు వాయిద్య కళాకారులు తమ విన్యాసాలతో, వైఎస్సార్‌సీపీ జెండాలతో గుర్రపు స్వారీ చేసేవారు అగ్రభాగాన కొనసాగారు. ర్యాలీ ప్రారంభంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఉన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంపీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా కోశాధికారి హఫీజుల్లా, డాక్టర్ సొహైల్ తదితరులు ర్యాలీ వెంట నడిచారు. వారికి స్థానిక ప్రజలు, మహిళలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.పూలు చల్లుతూ భారీ ఎత్తున బాణాసంచా పేల్చుతూ మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. యూఎస్ మహల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రవీంద్రనగర్, పాతబస్టాండు మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరింది. భవనాలకు కట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పాత బస్టాండులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో నడుస్తున్న వైఎస్సార్ సీపీ నేతలను అభిమానులు పాత బస్టాండు, ఏడురోడ్ల కూడలిలో గజమాలలు తెచ్చి క్రేన్ల సాయంతో వారికి అలంకరించి ఘనంగా సత్కరించారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. అత్యధిక సంఖ్యలో మహిళలు, యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అన్ని డివిజన్ల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. యూఎస్ మహల్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు మేధావులతో సమావేశం నిర్వహించారు. 1.30 గంటలకు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. 2 గంటలకు ముఖ్యనేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. 3.25 గంటలకు సామాజిక సాధికార బస్సుయాత్ర ర్యాలీ ప్రారంభమైంది. 4.20 గంటలకు ఏడురోడ్ల కూడలిలో బహిరంగ సభ ప్రారంభమై 5.55 గంటలకు ముగిసింది. ఏర్పాట్లను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వారి సోదరుడు అహ్మద్‌బాషాలు చేశారు.




మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



అలరించిన లంబాడీల నృత్యాలు

మీ నమ్మకాన్ని వమ్ము చేయను...



కడప నియోజకవర్గ ప్రజలు నాపై ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయను. కడపను ఆదర్శంగా తీర్చిదిద్దుతా. చంద్రబాబు నాలుగున్నరేళ్లలో మైనార్టీలను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. మీరు రెండు పర్యాయాలు నన్ను అసెంబ్లీకి పంపితే, వైఎస్ జగన్ డిప్యూటీ సీఎం పదవి అప్పగించారు. కడపలో కోట్లాది రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో కడపకు ఏం చేశారో చెప్పాలి.

– ఎస్‌బి అంజద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

పేదల జీవితాలు మార్చడానికి యజ్ఞం



పేదల జీవితాలను సమూలంగా మార్చడానికి జగనన్న ఒక యజ్ఞం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చారు. కేబినేట్‌లో 70శాతం మంత్రి మంత్రులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే ఉన్నారు. నామినేటేడ్ పోస్టులు భర్తీ చేసినా, రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసినా బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజలు జగనన్నను ఆశీర్వదించాలి.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ

వెనుకబడిన వర్గాల ఉన్నతికి కృషి



భారతదేశ చరిత్రలో బీసీలు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ములాయంసింగ్, అఖిలేష్ యాదవ్, నితీష్‌కుమార్, స్టాలిన్‌ల సర్కార్‌లో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇంతటి ప్రాధాన్యత దక్కలేదు. వెనుకబడిన వర్గాల ఉన్నతి కాంక్షించిన ఏకైక సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డే. కడప జిల్లాలో 2006 నుంచి ఇప్పటికీ నన్ను జిల్లా అధ్యక్షుడుగా నడిపించడమే అందుకు నిదర్శనం.

– కె.సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మన తలరాతలు మారాలంటే జగన్ రావాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కడప కార్పొరేషన్ : మన తల రాతలు మారాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం కడపలోని యూఎస్ మహల్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ కుంభా రవిబాబులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నాయంటూనే అన్ని పార్టీలకు సామాజిక న్యాయం, సాధికారత గుర్తుకు వస్తాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రాజకీయంగా, సామాజికంగా ఏం లబ్ధి చేకూర్చారో చెప్పాలని నిలదీశారు. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మీ కుటుంబాలకు మేలు జరిగి ఉంటేనే నాకు ఓటేయాలని అడిగే దమ్మున్న నేత ఒక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డేనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం వల్ల మన విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో మాట్లాడే అవకాశం లభించిందన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను జగనన్న ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చారన్నారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కావడానికి 76 సంవత్సరాలు పట్టిందని, కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరుపైనే ఇస్తూ ఆర్థిక సాధికారత దిశగా పయనింపజేస్తున్నారన్నారు.

- ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మార్కెట్‌యార్డు చైర్ పర్సన్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు పేదల శ్రమను దోపిడీ చేశాయి

గతంలో పాలించిన అన్ని ప్రభుత్వాలు పేదలు, బడుగు, బలహీన వర్గాల శ్రమశక్తిని దోపిడీ చేశాయని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను ప్రథమ శ్రేణి పౌరులుగా తీర్చిదిద్దేందుకు వారిని సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయికి తెస్తున్నారన్నారు. తన మంత్రివర్గంలో 17 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉండడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది జెడ్పీ చైర్మన్లలో 12 మంది, మేయర్లలో 9 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. అమరావతిలో 51 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు జోరుగా ఏర్పాట్లు



దర్గా వద్ద దుకాణాల ఏర్పాటు పనులు

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు ఉత్సవాలకోసం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల సంప్రదాయంగా నషాన్ ఉత్సవాన్ని నిర్వహించి దర్గా ఉరుసు ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా పది రోజులుగా ప్రాగణంలో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో ఎస్పీ శాంతిభద్రతల వ్యవహారాలను, మున్సిపల్ కమిషనర్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు. దర్గా ప్రాంగణమంతా పార్కుల్లో లాగా సిమెంటు ఇటుకలు పరిచారు. జియారత హోటల్ ప్రాంగణంలో బయటి ప్రాంతాల నుంచి రానున్న భక్తుల కోసం భారీ పందిరి వేశారు. దర్గా పరిసరాల్లో దుకాణాల ఏర్పాటు కోసం పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ఉరుసు సందర్భంగా పిల్లలు, యువకులు వినోదం కోసం జియారత హోటల్ సమీపంలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు దర్గా ప్రాంగణంలో ఉరుసు ఉత్సవాల ఏర్పాట్ల గురించి దర్గాప్రతినిధులు మీడియాకు వివరించనున్నారు.

ఐఈఎస్‌కు ఎంపికైన రైతుబిడ్డ



మనోహర్‌రెడ్డి

పెద్దముడియం: మండలకేంద్రం పెద్దముడియానికి చెందిన రైతు తుంగ రామసుబ్బారెడ్డి కుమారుడు తుంగా మనోహర్ రెడ్డి యూపీఎస్సీ నిర్వహించిన ఐఈఎస్(ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్)లో ఆలిండియా 5వ ర్యాంకు సాధించాడు. రామసుబ్బారెడ్డి తనకున్న 3 ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ గ్రామంలో చిన్న హోటల్ నడుపుకుంటూ కుమారుడిని చదివించారు. మనోహర్ రెడ్డి 1 నుంచి 5వ తరగతి వరకు జమ్మలమడుగులో, 5 నుంచి 10వ తరగతి వరకు ఆళ్లగడ్డలో, తిరుపతి ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నిక్ చదివాడు. తిరుపతి ఎస్.వి.సి.ఇ ఇంజినీరింగ్ కళాశాలలో 2019లో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం సంవత్సరం పాటు యూపీఎస్సీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం నేషనల్ టాలెంట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన తాజాగా వెలువడిన ఐఈఎస్ ఫలితాల్లో 5వ ర్యాంకు సాధించారు. ఈయన విజయం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దాం

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం కలెక్టరేట్ సభా భవనంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు బలవంతంగా వివాహాలు నిర్వహించే తల్లిదండ్రులు, ఇతర పెద్దలపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంగా పనిచేసి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తుంటే టోల్ ఫ్రీ నెంబరు 112, 1098, కంట్రోల్ రూము నెంబరు 8045219131, 8045219132 లేదా 8045219133 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, దిశ డీఎస్పీ రమాకాంత్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీఆర్ సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర'



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈ నెల 24 నుంచి జనవరి 25 వరకు వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రత్యేక పర్యవేక్షణ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, 36 శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షునిగా పలువురు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రచార నిమిత్తం జిల్లాకు 5 వ్యాన్లు రానున్నాయన్నారు. 557 గ్రామపంచాయతీల్లో నెలరోజులపాటు కార్యక్రమం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిస్తున్న 17 పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకట్రావులు మాట్లాడుతూ వీక్షిత్ భారత్ కార్యక్రమం ద్వారా 36 శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాలను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం దుర్గా ప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తోబుట్టువులకు కల్యాణమస్తు

జిల్లాలో 478 జంటలకు రూ.3.95 కోట్ల లబ్ధి



అతిథులతో కలిసి మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: పేదింటి ఆడపిల్లలకు ప్రభుత్వం అందించే అపురూపమైన కానుకలు వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు అని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ఈ పథకాల కింద నాలుగో విడత ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆది మూలపు సురేష్,ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి వీక్షించారు. జిల్లాలో వివాహం చేసుకున్న అర్హులైన 478 జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3,95,10,000 లను మెగా చెక్కు రూపంలో కలెక్టర్ అతిథులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల వెంకటలక్ష్మి, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు హిదాయతుల్లా, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ శివప్రసాద్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంతో ఉపయోగకరం



ప్రభుత్వం నుంచి కల్యాణమస్తు సాయం అందడం చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబంలో అన్ని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. మా అత్త ఇంట్లో కూడా వేర్వేరు పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న షాదీ తోఫా సాయం మా కుటుంబానికి ఎంతో ఉపయోగ పడుతోంది.

– సి.శారద, విశ్వానంద్ దంపతులు, తిలక్ నగర్ , కడప

ఆర్థిక ఆసరాను ఇస్తోంది



మాకు ఉన్న అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. కల్యాణమస్తు పథకం లబ్ధి మా తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరాను ఇస్తోంది. కొత్త జీవితం ప్రారంభించిన మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన కల్యాణమస్తు సాయం మాకు దేవుడిచ్చిన కానుకగా భావిస్తున్నాం.

– స్రవంతి, లక్ష్మణ్ దంపతులు, ఎస్. వెంకటాపురం, అట్లూరు మండలం

క్లుప్తంగా

నేటి నుంచి గండిలో అంజన్న పవిత్రోత్సవాలు



గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం సాయంత్రం నుంచి నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాడు ముకుందరెడ్డి, ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

ఫుట్‌బాల్ విజేత కడప



ట్రోఫీ అందుకుంటున్న బాలుర విన్నర్స్ జట్టు కడప

తగరపువలస : ఏపీ అంతర్ జిల్లాల 67వ ఎస్‌జీఎఫ్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో వైఎస్సార్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే బాలికల విభాగంలో వైఎస్సార్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. వీరు త్వరలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. మూడు రోజుల పాటు బాలురకు భీమిలి వుడా మినీ స్టేడియంలో, బాలికలకు సంగివలస వరల్డ్ అమేయా స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి.

గుర్తు తెలియని మహిళ మృతి



కడప అర్బన్ : కడప నగరంలోని నాగరాజుపేటలో పసుపులేటి హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం గుర్తు తెలియని మహిళ 55) మృతి చెందింది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. మహిళ బంధువులు ఎవరైనా ఉంటే 91211 00510, 9121100511, 9121100512 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంకు మహర్దశ

కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు రంగం సిద్ధమైంది. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా, వాలీబాల్ వంటి ఎన్నో క్రీడాపోటీలకు వేదికగా నిలిచిన మల్టీపర్పస్ కోర్టులను ఆధునీకరించేందుకు శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు అందుకునేలా రూ. 90 లక్షలు వెచ్చించి మలేషియా నుంచి మెటీరియల్‌ను తీసుకువస్తున్నారు. నెలరోజుల్లోపు పనులు పూర్తిచేసి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు నిర్వహణ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించారు.

- మల్టీపర్పస్ కోర్టు ఆధునీకరణకు శ్రీకారం
- రూ. 90 లక్షలతో పనులు ప్రారంభం
- అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం
- భూమిపూజ నిర్వహణ



వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం ఆవరణంలో 2005 జనవరి 28న అప్పటి ముఖ్యమంత్రి ఇండోర్ స్టేడియంకు శంకుస్థాపన చేశారు. అనంతరం 2009 జనవరి 24న ప్రారంభోత్సవం చేసి రూ.5.10 కోట్లతో తీర్చిదిద్దిన ఇండోర్ స్టేడియంను కడప ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి పలు జాతీయస్థాయి టోర్నమెంట్‌లకు వేదికగా నిలుస్తూ, జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా మారుమోగేలా ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందించింది.

రూ.90 లక్షలతో అభివృద్ధి పనులు..

ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులకు సంబంధించిన చెక్కలు కొన్ని ప్రాంతాల్లో కుంగడం, చెదలు పట్టడంతో మరమ్మతు చేయాలని భావించారు. అయితే కడప నగర కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో క్రీడామైదానాల అభివృద్ధి పనులు ప్రారంభించడంతో సమస్య ఆయన దృష్టికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన స్టేడియం ఆధునీకరణ పనులకు రంగం సిద్ధం చేశారు. దీంతో రూ.90 లక్షలతో ప్రస్తుతం ఉన్న ఉడ్, మ్యాట్‌ల స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలను కలిగి ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ అనుమతి పొందిన కేటీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో మలేషియా నుంచి హిదియా గ్రేడ్ స్ట్రెయిన్ మాబో ఉడ్‌ను వినియోగిస్తున్నారు. దీంతో పాటు ఎల్.వి.ఎల్. ప్యాటర్ కుషన్‌ను వినియోగించనున్నారు. పనులన్నింటినీ నెలరోజుల్లో పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల నిర్వహణ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించారు.



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్లు, డీఎస్‌ఏ సిబ్బంది

భూమిపూజ నిర్వహణ..

వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఆధునీకరణ పనులకు సంబంధించి భూమిపూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, యువనాయకుడు అఖిలేశ్వర్‌లు పాల్గొని టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం మేనేజర్ నాగయ్య, కోచ్‌లు సుదర్శన్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

మూడుసార్లు అమ్మఒడి అందుకున్నా



మా కుమార్తె డి.లిఖిత వైపీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇప్పటికి మూడు సార్లు అమ్మఒడి పథకం కింద నగదు అందుకున్నాను. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలు అభివృద్ధి చెందాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతోంది.

- డి.రాజేశ్వరి, విద్యార్థిని తల్లి, ప్రొద్దుటూరు

జగనన్న హయాంలోనే రేషన్ కార్డు అందింది



మాది కడప నగర పరిధిలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామం. నేను గత ప్రభుత్వాల హయాంలో ఎన్నోసార్లు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నాను. కానీ మంజూరు కాలేదు. అయితే జగనన్న ప్రభుత్వం రాగానే మా గ్రామ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి రేషన్ కార్డును అందించారు. గత ప్రభుత్వాల హయాంలో తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరిగి విసుగు చెందాను. ఈ ప్రభుత్వంలో ఏ పత్రం కావాలన్నా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు.

- సుజాత, ఊటుకూరు గ్రామం, 45వ డివిజన్, కడప

పోలీసులపై నిరాధార ఆరోపణలు చేయడం తగదు

- నిబంధనల మేరకే మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అరెస్టు
- అవాస్తవాలు ప్రచారం చేసిన నేతకు లీగల్ నోటీసులు
- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీసులపై జిల్లాకు చెందిన ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు పోలీసులపై చేసిన వ్యాఖ్యలు నిరాధారమని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఖండించారు. గురువారం రాత్రి కడప నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని అరెస్ట్ చేసేక్రమంలో పోలీసులు చట్ట పరిధిలో వ్యవహరించారన్నారు.

■ ఈనెల 14న రాత్రి 7:30 గంటలకు వల్లూరు పి.ఎస్ క్రైం నెం. 21/2023 కేసులో మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ చేసిన సమయం నుంచి కోర్టులో హాజరు పరచడానికి పోలీసులకు 24 గంటల సమయం ఉన్నా కూడా అన్ని న్యాయపరమైన వ్యవహారాలు పూర్తి చేసి, వైద్యపరీక్షలు నిర్వహించి పోలీసులు కేవలం మూడు గంటల్లోనే అదేరోజు రాత్రి 10:30 గంటలకు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారన్నారు.

■ ఆ ప్రముఖ రాజకీయ నాయకుడు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని చెప్పడం తగదన్నారు. జనవరిలో నమోదైన కేసులో అంటూ ఒక మాట, అప్పటికప్పుడు కేసు నమోదు చేసినట్లు మరోమాట పొంతన లేకుండా రెండు నాల్కల ధోరణితో మాట్లాడటం అతని స్థాయికి తగదన్నారు.

■ ఏ.ఎస్.ఐకి తగిలిన గాయంపై మే నెలలో డాక్టర్ నుంచి బలమైన గాయమైనట్లు వచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగా అదనంగా మరో సెక్షన్‌ను చేర్చామేతప్ప ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు.

■ చట్ట పరిధిలోనే సదరు మాజీ ఎంఎల్‌సీని కోర్టులో హాజరు పరిచామని వివరించారు.

■ అరెస్ట్ క్రమంలో పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఉంటే మాజీ ఎంఎల్‌సీ పోలీసులకు వ్యతిరేకంగా మెజిస్ట్రేట్ ముందు తన వాంగ్మూలం ఇచ్చేవారన్నారు. కానీ,మెజిస్ట్రేట్ ముందు తన అడ్వకేట్ల సమక్షంలో కూడా తాను పోలీసులపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

■ ఇప్పుడు ఆ ప్రముఖ రాజకీయ నాయకుడు జైలులో ఉన్న మాజీ ఎంఎల్‌సీని కలిసి కల్పితాలను జోడించి నిరాధార ఆరోపణలు చేయడం ఏమాత్రం సరైంది కాదన్నారు.

■ కల్పితాలతో పోలీసు శాఖ మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన ప్రముఖ రాజకీయ నాయకుడికి జిల్లా పోలీస్ శాఖ తరపున లీగల్ నోటీసులు జారీ చేయనున్నట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. ఈ సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

మదనపల్లె : ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డితో కలిసి పట్టణంలోని ఈస్ట్ సెక్షన్‌లోని సబ్‌స్టేషన్, డివిజనల్ కార్యాలయంలోని సబ్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం డిపాజిట్లు చెల్లించిన రైతులకు నెలన్నర రోజుల్లో కనెక్షన్లు ఇస్తామన్నారు. మదనపల్లె డివిజన్‌లో 1,082 మంది రైతులు కనెక్షన్లకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా 9గంటల పాటు సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్, గృహాలకు సంబంధించిన లైన్లను వేరుచేసి త్రీఫేజ్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

బద్వేలు అర్బన్ : బద్వేలుకు చెందిన కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగసాని గురుమోహన్ కుమార్తె వివాహ వేడుకలకు వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధ, శ్రీకాంత్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, రఘురామిరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (నార్త్‌అమెరికా) పండుగాయల రత్నాకర్ తదితరులు హాజరై వధూవరులైన స్వాతి, మణికంఠలను ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపుసురేష్

సొసైటీ బ్యాంకుల బలోపేతానికి కృషి

కలసపాడు : సొసైటీ బ్యాంకుల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. గురువారం కలసపాడులోని పుల్లారెడ్డిపల్లె దారిలోని అంకాలమ్మపరమేశ్వరి లేఅవుట్‌లో నాబార్డు నిధులతో నిర్మించనున్న కొత్తకోట సొసైటీ బ్యాంకు నూతన భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొసైటీ బ్యాంకులను మినీబ్యాంకులుగా మార్చి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 15 సంవత్సరాలలోపు పిల్లలు సొసైటీ బ్యాంకులో జీరో అకౌంట్‌తో ఖాతా తెరిస్తే వారికి పొదుపు బాక్స్ అందజేస్తామని తెలిపారు. ఆ డబ్బును తమ వద్ద ఉంచుకుని ఆకర్షణీయమైన వడ్డీని ఇవ్వనున్నామని పేర్కొన్నారు. జిల్లాలో డీసీసీ బ్యాంకు లాభాల బాటలో నడుస్తోందన్నారు. సొసైటీ బ్యాంకులను కూడా లాభాల బాటలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మల్లెల రాజారామమోహన్‌రెడ్డి, అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, నారాయణ యాదవ్, దేవసాని శ్రీనివాసులరెడ్డి, పులి వీరారెడ్డి, డీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాజామణి, శివశంకర్, సత్యనారాయణ, సీఈఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

రేపటి నుంచి ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ మల్టీడేస్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో సౌత్ జోన్, సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్, రెస్ట్ లెవెన్ జట్లు తలపడనున్నాయి. ఈనెల 25 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు.

తేదీలు	తలపడే జట్లు	వేదిక
25 నుంచి 27 వరకు	సౌత్‌జోన్ x సెంట్రల్ జోన్	కేఎస్ఆర్ఎం
25 నుంచి 27 వరకు	నార్త్‌జోన్ x రెస్ట్ ఆఫ్ లెవెన్	కేఓఆర్ఎం
29 నుంచి డిసెంబర్ 1	సెంట్రల్‌జోన్ x నార్త్‌జోన్	కేఎస్ఆర్ఎం
29 నుంచి డిసెంబర్ 1	సౌత్‌జోన్ x రెస్ట్ ఆఫ్ లెవెన్	కేఓఆర్ఎం
డిసెంబర్ 3 నుంచి 5	నార్త్‌జోన్ x సౌత్‌జోన్	కేఎస్ఆర్ఎం
డిసెంబర్ 3 నుంచి 5	సెంట్రల్‌జోన్ x రెస్ట్ ఆఫ్ లెవెన్	కేఓఆర్ఎం

ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పులివెందుల వుంచి బోనాల మీదుగా అంకెవానిపల్లెకు సాయంత్రం 4.30 గంటలకు బస్సు ఏర్పా టు చేయాలని అలాగే కడప-పామూరు, పామూరు-కడప బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారన్నారు. పులివెందుల నుంచి తొండూరు, అగుడూరు, చెర్లోపల్లి, పోతల పల్లె మీదుగా సోంపల్లెకు, దీంతోపాటు కడప ఆర్టీసీ బస్టాండు నుంచి రాజంపేటకు ఉదయం 7.30, 7.45 గంటల మధ్య బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాల ని కోరారన్నారు. వీటన్నింటిని సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని ఆర్ఎం తెలిపారు.

ఇంట్లోకి చొరబడి.. చోరీకి పాల్పడి..

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య నగర్ వీధిలో చోరీ జరిగింది. గురువారం బాధితులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సింగారెడ్డి అమరనాథరెడ్డి ఇంట్లో తన తల్లి నాగసుబ్బమ్మ ఒంటరిగా ఉండటంతో గుర్తు తెలియని దొంగలు చొరబడ్డారు. తల్లి నాగసుబ్బమ్మను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, గాజులు లాక్కొని ఇంట్లోని బాత్రూంలో పడేశారు. ఒక గంట గడిచిన తర్వాత పక్కింటి మహిళ ఇంట్లోకి రావడంతో బాత్రూంలో తలుపులు తడుతూ శబ్దం వినిపించింది. దీంతో ఆ మహిళ తలుపు తీయడంతో విషయం బయటకు వచ్చింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వచ్చి తనను కొట్టి బాత్రూంలో పడేశారని ఆ మహిళ చెప్పడంతో కుమారుడు అమరనాథరెడ్డికి ఫోన్ చేశారు. హుటాహుటిన ఆయన ఇంటికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉన్న కొత్త బంగారంతోపాటు దాదాపు 14తులాల బంగారం చోరీ అయినట్లు బాధితులు తెలిపారు.

అదుపుతప్పి ఆటోలను ఢీకొన్న కారు

బి.కోడూరు : మండలంలోని ఎర్రిఓబన్నబావి వద్ద గురువారం సాయంత్రం పోరుమామిళ్ల నుంచి బద్వేలుకు అధిక వేగంతో వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న ఆటోలను ఢీకొంది. దీంతో ఆటోలు స్వల్పంగా దెబ్బతినడంతో పాటు కారు ముందు భాగం బాగా దెబ్బతినింది. ఆ సమయంలో ఆటోల్లో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న బి.కోడూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఆస్తికోసం అత్తను కడతేర్చిన అల్లుడు



బాలమ్మ (ఫైల్)

కలసపాడు : ఆస్తికోసం అత్తను కడతేర్చిన అల్లుడి ఉదంతం మండలంలోని గంగాయపల్లెలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగమురళి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గంగాయపల్లెకు చెందిన ముట్టిబాలమ్మ (56)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసి తన ఇంటి వద్దే ఉంచుకుని బాగోగులు చూసుకునేది. గత రెండు సంవత్సరాల క్రితం పెద్ద అల్లుడు మృతి చెందాడు. బాలమ్మకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఒకటిన్నర ఎకరా పెద్ద కుమార్తె, ఒకటిన్నర ఎకరా పొలం చిన్న కుమార్తెలు అనుభవించుకోమని ఇచ్చింది. మిగిలిన ఒక ఎకరా పొలంలో బాలమ్మ పండించుకుంటూ ఉండేది. అయితే ఇటీవల చిన్న అల్లుడు తెల్లగొల్ల సునీల్ అప్పులు ఎక్కువై, మద్యానికి బానిసై తన అత్త పేరు మీద ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని తన పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించాలని గొడవ పడుతుండేవాడు. అయితే సునీల్ పేరు మీద భూమి ఆన్‌లైన్ ఎక్కిస్తే ఎక్కడ భూమిని విక్రయిస్తాడోననే భయంతో బాలమ్మ అందుకు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి బాలమ్మ పొలం నుంచి ఇంటికి వస్తుండగా చిన్న అల్లుడు సునీల్ అడ్డుకుని ఆమెతో గొడవపడి గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దకుమార్తె సుంకర కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన బాలమ్మ

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె గ్రామ పొలంలో బుధవారం రాత్రి కొవ్వూరి జయసుధ (30) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతురాలి తండ్రి పెద్దన్న ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం కొవ్వూరువాండ్లపల్లెకు చెందిన కొవ్వూరి చిన్నప్ప కుమారుడు రమణయ్యకు పదేళ్ల క్రితం అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నూలివీడు సమీపంలోని అలుగుంటిపల్లెకు చెందిన తుర్ల పెద్దన్న కుమార్తె జయసుధను ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన 3 నెలలకే భార్యా భర్తల మధ్య విభేదాలు రావడంతో జయసుధ పుట్టింటికి వెళ్లింది. మూడు సంవత్సరాల అనంతరం పెద్ద మనుషులు పంచాయతీ చేసి ఆమెను కాపురానికి పంపారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు పుట్టారు. అయితే వ్యవసాయం చేస్తున్న రమణయ్యకు అతని తల్లి పంట సాగుకు పెట్టుబడి పెట్టి ఫలసాయం రాగానే వచ్చిన మొత్తం ఆమె తన కూతురికి పంపేది. కోడలు జయసుధ ఈ విషయమై ప్రశ్నిస్తే అప్పులు ఉన్నాయని చెప్పేది. ఈ నేపథ్యంలో మృతురాలు జయసుధ పెట్టుబడి మనమే పెట్టి పంట సాగు చేసుకుందాం అని భర్తతో చెప్పడంతో అందుకు ఆయన అభ్యంతరం తెలిపాడు. ఈ విషయమై వీరిద్దరూ తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి జయసుధ తండ్రికి బంధువులు ఫోన్ చేసి పొలంలో చెట్టుకు చీరతో ఉరి వేసుకొని జయసుధ చనిపోయిందని సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న మృతురాలి తల్లిదండ్రులు సంఘటనను చూసి తన అల్లుడు రమణయ్యే ఉరివేసి చంపినట్లుగా అనుమానంగా ఉందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి పరిశీలించారు.



మృతి చెందిన జయసుధ